
క్లుప్తంగా

ఇంటర్ తరగతులు ప్రారంభం

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. ఉదయం విద్యార్థులచే యోగా కార్యక్రమం నిర్వహించారు. మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు ఈనెల 15వతేదీలోపు చేరవచ్చునని ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ కాలేజీలో చేరాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



నకిలీ రసీదు బిల్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పీలేరు మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీ కార్యదర్శి నాగభూషణం భారీ వాహనాలకు పార్కింగ్ ఫీజును నకిలీ రసీదులతో వసూలు చేసి స్వాహా చేసినట్లు యర్రగుంట్లపల్లెకు చెందిన దినచంద్రారెడ్డి, రెడ్డిశేఖర్ తదితరులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గత 11 నెలలుగా పంచాయతీ కార్యదర్శి తన సంతకం లేకుండా రూ. 300 రసీదులు ఇస్తూ డబ్బులు స్వాహా చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యాలయానికి జమచేయకుండా స్వాహా చేసిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హోప్ స్కూల్ హెచ్‌ఎంగా రఘు

మదనపల్లె సిటీ: మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పి.రఘు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న హెచ్‌ఎం వసంతకుమారి వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఆర్ ఆర్ లేవుట్)కు బదిలీపై వెళ్లారు. రఘును యూటీఎఫ్ నాయకులు పురం వెంకటరమణ, సుధాకర్,శీనప్ప తదితరులు అభినందించారు.

కరాటేలో ఆరుగురికి బ్లాక్‌బెల్ట్

పీలేరురూరల్ : కరాటే బెల్ట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన ఆరు మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సాధించినట్లు జేకేడీ కుంగ్ ఫూ సెంటర్ నిర్వాహకులు, కరాటే మాస్టర్ దామోదర్ తెలిపారు. సోమవారం స్థానిక కరాటే శిక్షణ కేంద్రంలో చరణ్‌కుమార్, ప్రవీణ్, రెడ్డిదీపక్ ఆచారి, హేమచంద్రన్, అబుబకర్ సిద్ధిక్, సారాఫాతిమాలకు బ్లాక్‌బెల్ట్ ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా సయ్యద్‌మాస్టర్, దస్తగిరి మాస్టర్ వ్యవహరించారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

కలికిరి: మండలంలోని గుట్టపాళెం గ్రామం గుట్టపాళెంకస్పాలో ప్రభుత్వ స్థలాన్ని స్థానికులు కొందరు ఆక్రమించుకుని కట్టడాలు చేపడుతున్నట్లు స్థానికులు సోమవారం గ్రామస్తులు తహసీల్దారు మహేశ్వరిభాయికి ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయంలో గుట్టపాళెంకస్పా సమీపంలో అమూల్ డైరీ ఏర్పాటుకు స్థలం కేటాయించి, భవన నిర్మాణాలు దాదాపుగా పూర్తి కావచ్చిన స్థితిలో ఉందని, ప్రస్తుతం స్థానికులు కొందరు డైరీ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్వారీ వ్యర్థాలతో సూరయ్యగారికుంట చెరువు పూడ్చివేత

- పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసిన చెరువుకింద సాగుదార్లు
- ఉపాధిహామీ కూలీలకు వేతనాలు మంజూరుచేయాలి
- మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి


ఉపాధిహామీ వేతనాలు చెల్లించాలని నిమ్మనపల్లె మండల కూలీలు నిరసన

మదనపల్లె రూరల్ : మండలంలోని పోతపోలు గ్రామం శిద్దమ్మగారిపల్లె సమీపంలోని సూరయ్యగారికుంట చెరువును క్వారీ వ్యర్థాలతో పూడ్చివేస్తూ, ఆయకట్టు రైతులకు సాగునీరు అందకుండా చేస్తున్నారని రైతులు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో...సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ వ్యక్తిగత సెలవులో ఉండటంతో ఆయన స్థానంలో డీఏఓ రాఘవేంద్ర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మదనపల్లె డివిజన్‌లోని 11 మండలాలకు చెందిన పలువురు భూసమస్యలు, పరిహారం చెల్లింపు, ఇళ్లపట్టాలు, డీకేటీ స్థలాల ఆక్రమణ తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు.

సూరయ్యగారికుంట చెరువు పూడ్చివేత

మదనపల్లె మండలం శిద్దమ్మగారిపల్లెకు చెందిన రైతులు మాట్లాడుతూ సూరయ్యగారికుంట చెరువుకు సమీపంలో జబ్బల శ్రీనివాసులు క్వారీ ఉందని, క్వారీలోని రాళ్ల వ్యర్థాలను టిప్పర్ల ద్వారా చెరువులోకి తోలడం జరుగుతోందన్నారు. చెరువులో వ్యర్థాలు తోలవద్దని పలుమార్లు చెప్పినప్పటికీ, పట్టించుకోకపోవడంతో చెరువు పూడిపోయిందన్నారు. దీంతో చెరువు నిండినా సాగుకు నీరు పూర్తిగా అందడం లేదన్నారు. సూరయ్యగారికుంట చెరువు విస్తీర్ణంను పూర్తిగా సర్వే చేయించి, చెరువులోకి ట్రాక్టర్లు, టిప్పర్లు రాకుండా గోతులు తీయించాలని చెరువుకింద వ్యవసాయ రైతులుగా కోరుతున్నామన్నారు.

ఉచిత ల్యాప్‌టాప్ కోసం దివ్యాంగురాలి వినతి

మదనపల్లె మున్సిపాలిటీ వైఎస్సార్ నగర్, బీకే. పల్లె, 2వవార్డులో నివాసం ఉంటున్న దివ్యాంగురాలు వలిపి లిఖిత...స్థానికంగా ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో రెండో ఏడాది బీఎస్సీ కంప్యూటర్ కోర్సు చదువుతున్నానని తెలిపింది. పుట్టుకతో దివ్యాంగురాలైన తనకు 75శాతం వైకల్యం ఉందని, కళాశాలలో ల్యాబ్, తరగతులకు హాజరుకాలేకపోతున్నట్లు పేర్కొంది. కళాశాల యాజమాన్యం ల్యాప్‌టాప్ ద్వారా ఆన్‌లైన్ తరగతులకు హాజరుకావచ్చని తెలిపారని, ప్రభుత్వం తనకు ల్యాప్‌టాప్ మంజూరుచేస్తే...చక్కగా చదువుకుని డిగ్రీ పూర్తిచేస్తానంది.

ఉపాధిహామీ వేతనాలు మంజూరుచేయాలి

నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ గుండ్లబురుజు మాలపల్లెకు చెందిన సుమారు 36మంది నాలుగునెలలుగా ఉపాధిహామీ దినసరికూలీలుగా 16 వారాలు పనిచేశామన్నారు. నాలుగునెలల వేతనాలకు సంబంధించి నెలరోజుల క్రితం నాలుగువారాల డబ్బులు చెల్లించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు మిగిలిన 13 వారాల డబ్బులు ఇవ్వలేదన్నారు. సకాలంలో కూలీ డబ్బులు అందకపోవడంతో రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తక్షణమే ఉపాధిహామీ వేతనాలు మంజూరు చేయాల్సిందిగా కోరారు.

మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని గిరిజనసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. కన్వీనర్ డాక్టర్.బాణావత్ మునీంద్రనాయక్ ఆధ్వర్యంలో గిరిజనసంఘనాయకులు డీఏఓ రాఘవేంద్రను కలిసి విన్నవించారు. గిరిజన కళాకారులకు గుర్తింపుకార్డులు, పెన్షన్ మంజూరుచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయించిన ట్రైబల్ సబ్‌ప్లాన్‌ను గిరిజనుల అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు.

అనుమతులు లేకుండా కాలేజీ, స్కూల్స్ నిర్వహణ

మదనపల్లె పట్టణంలో, కార్పొరేట్ సంస్థల పేరు పెట్టుకున్న కొన్ని ప్రైవేట్ కాలేజీలు, స్కూల్స్..అనుమతి లేకుండానే అడ్మిషన్లు చేసుకుంటూ, లక్షల రూపాయల ఫీజులు వసూలుచేస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సర్వేపల్లి నరసింహ ఫిర్యాదుచేశారు.

క్షయరహిత సమాజంగా తీర్చిదిద్దుదాం


పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది


మదనపల్లె : టీబీ ముక్తభారత్ అభియాన్ పోస్టర్ల ఆవిష్కరణ

పీలేరురూరల్ : క్షయరహిత సమాజంగా తీర్చిదిద్దడానికి సమష్టి కృషి అవసరమని డాక్టర్ నాగవేణి, డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం టీబీ ముక్త భారత్ అభియాన్ విస్తృత క్యాంపెయిన్ ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ టీబీ వ్యాధి నిర్ధారన, తక్షణ చికిత్స కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. తద్వారా వ్యాధులు మరణాలు భారీగా తగ్గి 2030 నాటికి టీబీ రహిత భార తదేశం సాధ్యం అవుతుందని తెలిపారు. టీబీ అంతం అందరి పంతం అంటూ నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ రాధ మాధవి వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ : టీబీ అంతం మన అందరి లక్ష్యం కావాలని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాపిరెడ్డిగారిపల్లెలో టీబీ ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సమీసంలో మానవహారం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం 100 రోజుల్లో టిబి అంతం అనే కార్యక్రమం ద్వారా పూర్తి ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. సిబ్బంది సర్వే పూర్తి చేసి వ్యాధిగ్రస్తులకు సహాయం చేయాలని సూచించారు. మద్యపానం, ధూమపానం, గుట్కా వినియోగించే వారిలో అధికంగా టీబీ ఉండే అవకాశం ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జవహర్‌బాబు, పీహెచ్‌ఎన్ అలివేలు, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, సుబ్బరత్న పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను విజయవంతం చేద్దాం

మదనపల్లె రూరల్ : టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏఓ రాఘవేంద్ర, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్. రమేష్ బాబు అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ 100రోజుల కార్యక్రమం సోమవారం నుంచి నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణాల్లో, గ్రామాల్లో టీబీ కేసులను వేగంగా గుర్తించడం, మరణాలను తగ్గించడం, కొత్త కేసులను గుర్తించడం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి పొగతాగేవారిని, మద్యం సేవించేవారిని, గతంలో టీబీ వచ్చి కోలుకున్న వారు, హెచ్‌ఐవీ.పాజిటివ్, బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్న వారిని, గర్భవతులను, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు ప్రభాకర్, నాగిరెడ్డి, దయాలన్ , సబ్ యూనిట్ ఆఫీసర్ ఖలీల్, టీబీ యూనిట్ సిబ్బంది శాంతి, వనజ కుమారి, సుశీల , తరుణ్ , సునీత, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి


విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న చింతల శ్రీధర్ రెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలలో రాణించాలని, క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. క్రీడలలో రాణించిన విద్యార్థులు ఆర్మీ, పోలీస్, పీఈటీ, పీడీ ఉద్యోగాలలో రాణిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి తన వంతుగా శిక్షణ కాలంలో ఉచిత పౌష్టికాహారం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవిచందర్, ఎంఈఓ సుబ్రమణ్యం, సీనియర్ క్రీడాకారులు శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథ రెడ్డి, నరసింహశాస్త్రి, చంద్రమోహన్, సాయి భార్గవ్, హేమంత్ యాదవ్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయండి


ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మార్కెట్ యార్డు కమిటీ సభ్యులు

పీలేరు : వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి కమిటీ చైర్మన్ తోపాటు డైరెక్టర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పీలేరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా పురం రామ్మూర్తి తోపాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవులు శాశ్వితం కాదని, మనం చేసిన సేవ ప్రజలకు గుర్తిండిపోతుందని తెలిపారు. పీలేరు, కేవీపల్లె మండలాల్లో వ్యవసాయం మార్కెట్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కంచిసూరి, రెడ్డెప్పరెడ్డి, చాపల సూరి, రాజ, శ్రీనాథరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టమాటా మార్కెట్‌యార్డును తరలించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలోని టమాటా మార్కెట్‌యార్డును వేరే చోటుకు తరలించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మదనపల్లె మార్కెట్‌యార్డుకు నియోజకవర్గం నుంచే కాకుండా తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలు, కర్నాటక నుంచి పెద్దసంఖ్యలో రైతులు టమాటాలను తీసుకువచ్చి విక్రయించడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం టమాటాతో పాటు మామిడి సీజన్ నడుస్తున్నందున, రెండు పంటలకు సంబంధించి వందల సంఖ్యలో వాహనాలు రావడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. మార్కెట్‌యార్డులో స్థలం సరిపోక ట్రాక్టర్లు, లారీలు...నీరుగట్టువారిపల్లె రోడ్డులో బారులు తీరుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఐటీయూసీ డివిజనల్ కన్వీనర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలుచేయాలి

మదనపల్లె రూరల్ : ఎన్నికల సందర్భంగా కూటమినాయకులు ప్రజలకు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలను అమలుచేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు సాంబశివ, కృష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళీ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అర్హులైన పేదలకు పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలం మంజూరుతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని, సూపర్‌సిక్స్ హామీలు అమలుచేయాలని కోరుతూ నిరసన తెలిపారు.

బి.కొత్తకోట : సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ శ్రేణులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాయి. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జి.రఘునాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీ సిద్ధార్థ ప్రభంజనం


జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థినులతో యాజమాన్యం

మదనపల్లె రూరల్ : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వెంకటరెడ్డి శ్రీ సిద్ధార్థ రెసిడెన్సియల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్డ్ ఐఐటీ–2025 ఫలితాల్లో పట్టణంలోని మొదటి రెండు స్థానాలను వెంకటరెడ్డి శ్రీ సిద్ధార్థ విద్యార్థులు సాధించారని ప్రిన్సిపాల్ ఈ.వెంకటరెడ్డి తెలిపారు. కళాశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ కళాశాలకు చెందిన పి.దేదీప్యసాయి (256002076) జాతీయస్థాయిలో ఆల్‌ఇండియా 736 ర్యాంకును సాధించి పట్టణంలో మొదటిస్థానం, బి.తనూశ్రీ (256051397) ఆల్‌ఇండియా 2,413 ర్యాంకుతో పట్టణంలో రెండోస్థానం సాధించారన్నారు. జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో ఘన విజయం సాధించిన విద్యార్థులకు స్వీట్స్ తినిపించి, సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఈ.హేమంత్‌కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆర్‌ఐ అవినీతిపై రైతుల నిరసన

తంబళ్లపల్లె: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే ఆర్‌ఐ ప్రజల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడటమే కాకుండా రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు గంగరాజు సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్‌ఐ ముద్దకృష్ణమ రైతుల పట్ల సంస్కారం లేకుండా ప్రవర్తిస్తూ ఎలాంటి చిన్న పనికైనా పైసలిస్తేనే పని చేస్తారని ఆరోపించారు. అతని పనితీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. నిరసన కార్యక్రమంలో వెంకటమల్లప్ప, చలపతినాయుడు, నిరంజన్‌రెడ్డి, శ్రీధర్, రమణయ్య, వాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది నయవంచన పాలన


మదనపల్లెలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మనూజారెడ్డి, షమీం, కౌన్సిలర్లు

రాష్ట్రంలో చంద్రబాబు నయవంచన పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. సోమవారం మదనపల్లె, పీలేరు, తబళ్లపల్లె నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఈనెల 4న వైఎస్‌ఆర్సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. అన్ని మండలాల్లో కార్యక్రమం చేపట్టి నిరసనలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

\- సాక్షినెట్‌వర్క్



పీలేరులో పోస్టర్లు ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కలికిరిలో పోస్టర్లు ఆవిష్కరణ


కేవీపల్లెలో..



కలకడలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న నాయకులు , గుర్రంకొండలో..


పెద్దతిప్పసముద్రంలో..


వాల్మీకిపురం కార్యాలయంలో


బి.కొత్తకోటలో..


కురబలకోటలో..